నష్టపరిహారం అందించండి మహాప్రభో

- ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణాలకు ఇళ్లు కోల్పోయాం
- మూడేళ్లవుతున్నా అందని నష్టపరిహారం



తుమ్మలపల్లె గ్రామంలో ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణాలకు కోల్పోనున్న ఇళ్లు

పులివెందుల రూరల్ : విజయవాడ–బెంగళూరు హైవే నిర్మాణ పనులకు సంబంధించి ముద్దనూరు రోడ్డులోని తుమ్మలపల్లె రైతులకు మూడేళ్లవుతున్నా నష్టపరిహారం అందలేదని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోర్‌లైన్ హైవే రోడ్డు నిర్మాణాలకు సంబంధించి ఇళ్లు కోల్పోయామని ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం అందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తుమ్మలపల్లె గ్రామానికి సుమారు రూ.8 కోట్లు మంజూరైందన్నారు. తుమ్మలపల్లె గ్రామానికి సంబంధించి భూములకు మాత్రమే నష్టపరిహారం అందించారని, నష్టపోయిన ఇళ్లకు మాత్రం నష్టపరిహారం అందించలేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. మా ఇళ్లు కోల్పోతే మేం ఎక్కడ నివసించాలని ఆవేదన చెందుతున్నారు. హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే పూర్తి చేశారని ఎప్పుడు రోడ్డు నిర్మాణ పనులు చేపడతారో అర్థం కావడంలేదన్నారు.

నిధులు మంజూరైనా నష్టపరిహారం అందించలేదు



ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి తుమ్మలపల్లె గ్రామానికి రూ.8 కోట్ల నిధులు మంజూరైనప్పటికి రైతులకు, ప్రజలకు నష్టపరిహారం కింద ఒక్క రూపాయి కూడా అందించలేదు. ఇళ్లు కోల్పోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు స్పందించి పరిహారం అందించాలి.

– ఉపేంద్రారెడ్డి, బాధితుడు, తుమ్మలపల్లె

నష్టపరిహారం వెంటనే అందించాలి



విజయవాడ నుంచి బెంగళూరు వరకు నిర్మిస్తున్న హైవే రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి తుమ్మలపల్లె గ్రామంలోని రైతులు, గ్రామ ప్రజల ఇళ్లులు రోడ్డు నిర్మాణానికి కోల్పోయారు. రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని సర్వే కూడా పూర్తి చేశారు. కానీ నష్టపోయిన ఇళ్లకు ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం అందలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం అందించాలి.

– విశ్వనాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు, తుమ్మలపల్లె

సేవా సంస్థకు సహకారం అందించండి



మానవత సంస్థ తరపున ఆర్థిక సాయం అందజేస్తున్న గురుప్రసాద్

పులివెందుల టౌన్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే సభ్యుల పూర్తి సహాయ సహకారాలు అవసరమని ప్రొద్దుటూరు ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్, లయోలా డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మానవతా సంస్థ అధ్యక్షుడు జయరాజు అధ్యక్షతన నిర్వహించిన నెలవారి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే సభ్యుల పూర్తి సహాయ సహకారాలు అవసరమన్నారు. వారి చేతుల మీదుగా క్రిష్టియన్‌లైన్‌కు చెందిన రెండు కాళ్లు కోల్పోయిన శామ్యూల్‌కు వైద్య నిమిత్తమై ఆర్థిక సహాయాన్ని వారి సతీమణికి రూ.7వేలు అందజేశారు. మానవతా చైర్మన్ డీవీ కొండారెడ్డి, సెక్రటరీ గంగిరెడ్డి, కోశాధికారి శ్రీహరిచంద్రారెడ్డి, సంస్థ చేపట్టిన కార్యక్రమాలను, చేపట్టవలసిన కార్యక్రమాలను వివరించారు. సమావేశానికి హాజరైన సభ్యులకు రిటైర్డ్ హెడ్మాస్టర్ సదాశివరెడ్డి అల్పాహారం ఏర్పాటు చేశారు.

జ్వరాలు అదుపులో ఉన్నాయి

పులివెందుల రూరల్ : పులివెందుల సబ్ యూనిట్ పరిధిలోని తాళ్లపల్లె వేముల, నల్లపురెడ్డిపల్లె, లింగాల, బిదినంచర్ల, తొండూరు, సంతకోవ్వూరు, అర్బన్ హెల్త్ సెంటర్ నగరిగుట్ట, బాకరాపురం పరిధిలోని గ్రామాలలో విషజ్వరాలు అదుపులో ఉన్నాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. గ్రామాలకు వెళ్లి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు వైద్యులు చెప్పే సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. జ్వరాలు ఉన్న గ్రామాలలో ఎప్పటికప్పుడు దోమల నివారణకు మందును పిచికారి చేయాలన్నారు. లార్వాను ప్రారంభదశలోనే నాశనం చేయాలన్నారు.

ఎస్టీయూ క్యాలండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, ఎస్టీయూ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్రోపాధ్యాయ సంఘం 2025 డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించారు. శనివారం రాత్రి రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను బాగా చదివించి పరీక్షల్లో మంచి ఫలితాలను వచ్చేవిధంగా చేయాలని సూచించారు. తాను జమ్మలమడుగు ప్రాంత వాసినని ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఇక్కడే చదివానన్నారు. కాబట్టి పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులు ఈ మూడునెలలపాటు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, రీజనల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుగులులేక వృథాగా ఉన్న బస్ షల్టర్



కుర్చోవడానికి అరుగులు లేని ధర్మాపురం బస్‌షల్టర్

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని గొరిగెనూర్, ధర్మాపురం, దేవగుడి తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ నిధులతో బస్ షల్టర్లు నిర్మించారు. ఒక్కో బస్ షల్టర్ కోసం రూ.2లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. అయితే కొంత మంది ఆకతాయిల వల్ల షల్టర్లలో ప్రయాణికులు అరుగులు లేక కూర్చోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన షల్టర్లలో అరుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్లు మురుగుమయం



పాఠశాలలకు వెళ్లే రహదారిలో సీసీరోడ్లపై మురుగునీరు

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో పాఠశాలలకు వెళ్లే రహదారి, పేట వీధిలోని ఒక రహదారి మురుగునీటితో బురదమయమయ్యాయి. దీంతో ఆ రోడ్లపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న కస్తూర్బా, ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి రోజు మురుగుమయం అయిన ఈ రహదారి గుండా పాఠశాలలకు వెళుతూ ఉంటారు. దీంతో ఈ రహదారి వెంబడి వెళ్లే ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రయాణించాలంటే జంకుతున్నారు. సీసీ రోడ్లు ఉన్నప్పటికీ మురుగుకాలువలు లేకపోవడంతో నీరు అంతా రోడ్లపైకి రావడంతో రోడ్లు అంతా మురుగుమయం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపైకి మురుగునీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపై ఆవులు.. ఇళ్లవద్ద కోతుల బెడద



ముద్దనూరు రోడ్డులో రోడ్డుపై ఉన్న ఆవులు



ఇళ్ల ముందు కుర్చున కోతులు

జమ్మలమడుగు : పట్టణంలో ఆవులు రోడ్లపైన తిరుగుతూ, అలాగే ఇళ్లవద్ద కోతుల బెడద ప్రజలకు తప్పడం లేదు. ఆవుల యజమానులు మాత్రం ఉదయపూట ఆవులకు పాలు పిండుకుని బయటకు వదిలేస్తున్నారు. ఆవులు పట్టణంలోని వివిధ ఇళ్లవద్దకు వెళ్లుతుండటంతో స్థానిక ప్రజలు వాటిపై ఉన్న గౌరవంతో పూజలు చేసి తినటానికి గింజలు పెడుతున్నారు. ముద్దనూరు రోడ్డు, తాడిపత్రి రోడ్డులో ఆవులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. రోడ్లపైనే ఆవులు ఒకదానిపై ఒకటి కుమ్ముకోవడం వల్ల ఎక్కడ తమ మీద పడతాయో అంటూ ద్విచక్రవాహన దారులు, పాదచారులు భయపడుతున్నారు. అలాగే పట్టణంలో కోతులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలపై ఎక్కడ దాడి చేస్తాయో అంటూ తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. గతంలో ఆవులు రోడ్లపై తిరుగుతుండటంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆవులను తీసుకుని వచ్చి మస్టర్ పాయింట్‌లో పెట్టి వాటి యజమానులు జరిమానాలు కట్టి తీసుకుపోవలసిందిగా నిబంధనలు పెట్టారు. దీంతో ఆవుల యజమానులు మున్సిపల్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. నిబంధనల ప్రకారం జరిమానాలు కట్టి తీసుకుపోవాలని లేకుంటే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. అయితే హెచ్చరికలను బేఖాతరు చేస్తూ తిరిగి ఆవుల యజమానులు రోడ్లపైకి వదిలేస్తున్నారు.

అపన్న హస్తం కోసం ఎదురుచూపు



మతిస్థిమితం లేని భార్య కుమారితో భర్త రమణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని జయమ్మ కాలనీలో నివాసముంటున్న కుమారి అనే మహిళ గత కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగాలేక అనారోగ్యంతో రోడ్లపై తిరుగుతోంది. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలంటే ఆమె భర్త దగ్గర సరిపడా డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. మతిస్థిమితంలేని కుమారి భర్త రమణ పులివెందుల పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ తనకు వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలంటే డబ్బులు చాలా అవసరం హోటల్లో పనిచేస్తూ వచ్చిన డబ్బులతో ఆమెను చికిత్స కోసం కర్నూలు, తిరుపతి, అనంతపురం, కడప ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అయినప్పటికీ ఆమెకు ఆరోగ్యం బాగుపడలేదు. దీంతో చేసేదేమీ లేక భర్త రమణ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి సాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు.

రాలుతున్న కంది పూత



పెద్దపసుపుల గ్రామంలో సాగు చేసిన కంది పంట

పెద్దముడియం : వరుస అల్పపీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల కంది పంటకు నష్టం వాటిల్లుతోంది. మండల వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం 6700 ఎకరాలలో కంది పంటను రైతులు సాగు చేశారు.అయితే పంట ఏపుగా పెరిగి పూత, పిందె దశలో ఉంది. బహిరంగ మార్కెట్‌లో రూ.7500–8000 ధర పలుకుతుండటంతో మంచి దిగుబడి లభించి మిగులు లభిస్తుందని రైతులు భావించారు.అయితే తుఫానుల ప్రభావంతో ఆకాశం మబ్బులుగా ఏర్పడి వర్షం తుంపర్లగా పడటంతో పూత, పిందె నేల రాలుతోంది. దీంతో నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల వారీగ పర్యటించి పంట నష్ట నివారణకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రగతి పథంలో తొండూరు హైస్కూల్



పాఠశాలలో స్టడీ క్లాస్‌లో పాల్గొన్న విద్యార్థులు

తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. ఆరేళ్ల క్రితం 200 లోపు ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 365కు చేరింది. ప్రతి సంవత్సరం ఈ పాఠశాల పదవ తరగతిలో చక్కటి ఫలితాలను సాధిస్తోంది. గత రెండు విద్యాసంవత్సరాలలో ఈ పాఠశాల విద్యార్థులు ఎస్–వైష్ణవి 575 మార్కులతో ఎస్.గౌతమ్ 577 మార్కులతో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 57 మంది విద్యార్థులున్నారు. జూలై 1వ తేదీ నుండే ఈ పాఠశాలలో ఉదయం, సాయంత్రం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక అధ్యయనా తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షా రంగంలోనూ ఈ పాఠశాల తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రతి సంవత్సరం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఠీండీ పకార వేతనాల పరీక్ష ఎన్ఎంఎంఎస్‌లో ఈ పాఠశాల చిన్నారులు సత్తా చాటుతుంటారు. గత సంవత్సరం ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇది నియోజకవర్గస్థాయిలో మొదటిస్థానం, జిల్లాస్థాయిలో నాలుగోస్థానం. పాఠశాలకు అదనపు వనరులు సమకూర్చుకోవడంలో ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపుతుంటారు. ఈ పాఠశాలలో జరిగిన్ని పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు జిల్లాలో మరెక్కడా ఇటీవల జరగలేదనడంలో అతిశయోక్తి లేదు. పూర్వవిదార్థుల నుంచి, దాతల నుంచి పాఠశాలకు శుద్ధినీటి జలప్లాంటు పదవ తరగతి విద్యార్థులకు రూ.50 వేలు విలువైన స్పీకర్ సిస్టమ్, ఆటల పరికరాలు, మహాముఖచారం, ప్రొజెక్టర్లు సెంటర్, కంప్యూటర్ల వంటి అనేక అదనపు హంగులు సమకూరాయి.

ఈ నేపథ్యంలో పాఠశాల డిసెంబర్ 31న 62వ వార్షికోత్సవ సంబరాలను జరుపుకుంటోంది. పాఠశాల పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయలను, దాతలను, విద్యార్థుల తల్లిదండ్రులను ఈ సంబరాలకు ఆహ్వానించారు. పాఠశాల పూర్వ చరితను తెలుసుకుని మరింత శక్తివంతంగా ముందుకు వెళ్లడానికి ఇలాంటి వార్షికోత్సవాలు ఉపకరిస్తాయని ప్రధానోపాధ్యాయలు కె.వి.సుబ్బారెడ్డి తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



కమలాపురంలో గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి

కమలాపురం : జనవరి 4, 5 తేదీలలో కడపలో జరగనున్న సీపీఐ(ఎం) మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కామనూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. కమలాపురం మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం సీపీఎం జిల్లా మహాసభల గోడపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహాసభ సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన టీడీపీ నాయకత్వంలోని ఎన్డిఏ సంకీర్ణ ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో మన రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ధైర్యంగా ఎండగడుతూ తమ పార్టీ ప్రజల్ని చైతన్యవంతం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతి రాజధాని నిర్మాణం, కరువు సమస్య, విద్యుత్ చార్జీలు, పన్నుల భారం, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న ప్రజల అన్ని సమస్యలమీద పోరాటం చేస్తూ వాటి పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను సీపీఎం ముందుకు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో తిరుమల లడ్డుపై మతవిద్వేష రాజకీయం చేస్తూ సమాజంలో సహృద్భావ వాతావరణాన్ని విషపూరితంగా మార్చడానికి జరుగుతున్న కుట్రలను నిలువరించడానికి ప్రజలను సీపీఎం జాగ్రతుల్ని చేస్తోందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయండి



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పెద్దముడియం : మండలంలోని గుండ్లకుంట–మేడిదిన్నె గ్రామాల మధ్యలోని కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. దీంతో ఈ రహదారి ద్వారా ప్రయాణించాలంటే ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో గురుకుల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటం వలన ప్రతిరోజు పదుల సంఖ్యలో వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్: 1977 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మరియాపురం పాఠశాలలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాలలో 1977లో చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని పులకించిపోయారు. నాడు చదువుకునే రోజుల్లో చేసిన చిలిపి పనులను గుర్తుచేసుకుని ఆనంద పరవశంలో మునిగిపోయారు. అనంతరం హెడ్‌మాస్టర్ జోజిరెడ్డితోపాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

క్లుప్తంగా

సహజవనరులను వాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : ప్రతి పౌరుడు సహజ వనరులను వాడుకుని వాటిని భవిష్యత్ తరాలకు అందించే విధంగా చూడాలని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో ఎస్ఎస్ యూనిట్–9 ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అభివృద్ధి పేరుతో చెట్లు నరికి వేయడం వలను అడవులు అంతరించి పోతున్నాయన్నారు. దీనివల్ల ప్రపంచానికి పెను ముప్పు కలిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, కో ఆర్డినేటర్ దీప్తి, ప్రొగ్రాం అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడు మృతి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న తిప్పలూరు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు అయ్యవారు(35) కొన్నేళ్లుగా స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్నాడు. పాత మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున బాతురూంకు వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందారని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఉపాధ్యాయుడికి జాతీయ విశిష్ట సేవా పురస్కారం



జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సత్తెనపల్లి బాబు

జమ్మలమడుగు రూరల్ : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ సత్తెనపల్లి బాబుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఆదివారం ఆయన పుడమి సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాలిరెడ్డి చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం పట్టణంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు సాహిత్య పరిరక్షణలో అనేక పుస్తకాలు రచించి తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న సత్తెనపల్లి బాబు కృషికి ఫలితంగా ఈ పురస్కారం లభించింది. కాగా జమ్మలమడుగు వాసికి జాతీయ విశిష్ట సేవా పురస్కారం రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కమ్ముకున్న పొగమంచు



రింగ్‌రోడ్డులో కమ్మేసిన పొగమంచు

పులివెందుల టౌన్ : ఆదివారం తెల్లవారు జామున పొగమంచు కమ్మేసింది. దారులు పొగమంచుతో కనువిందుచేశాయి. పట్టణంలోని పార్నపల్లెరోడ్డు, అంబకపల్లెరోడ్డు, ఇందిరమ్మ రాణితోపు, బైపాస్‌రోడ్డు, రంగనాథస్వామి ఆలయం రోడ్డులు పొగమంచుతో కమ్మేయడంతో ప్రయాణికులు వెళ్లేదారి కనిపించక లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సివచ్చింది. ఊటీని తలపిస్తున్నట్లు ఉందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

రైతులు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని రైతులు ఎవరు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సింహాద్రిపురం మండలం దిద్దకుంట గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర కుటుంబ సభ్యులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. బ్యాంకులు విజయ మాల్యా లాంటి వారికి అయితే కోట్ల రూపాయలు అప్పులు ఇస్తారు కానీ అన్నం పెట్టే రైతులకు మాత్రం బ్యాంక్ ద్వారా అప్పులు తీసుకుంటే ఎలా కడతావు అంటూ రుణాలు ఇవ్వరు. అందువల్ల రైతులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

జనవరి 22న శోభాయాత్ర

కడప కల్చరల్: కడప నగరంలో 2025 జనవరి, 22న శ్రీరామ మహా శోభాయాత్ర నిర్వహించాలని ధార్మిక వేత్తలు నిర్ణయించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో అయోధ్య రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని నగరంలో భారీ ర్యాలీ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ ఏడాది జనవరి 22న ఉదయం సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం నుంచి నగరంలో టీటీడీ వేదిక్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రాజేష్ భట్టర్ పర్యవేక్షణలో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు.